సాక్షి
శ్రీకాకుళం
శనివారం । 29 । జూలై । 2023



డ్రాపౌట్లకూ సర్టిఫికెట్లు

ట్రిపుల్ ఐటీలో జాతీయ విద్యావిధానం అమలు చేస్తున్నారు. మధ్యలో మానేసినా సర్టిఫికెట్లు ఇస్తారు.

-IIలో



గెడ్డలో యువకుడు గల్లంతు

దేవునిపాలన వద్ద గెడ్డలో ఓ యువకుడు గల్లంతయ్యాడు. సెలవుల్లో వచ్చి ప్రమాదంలో చిక్కుకున్నాడు.

-IIలో

నేడు, రేపు కూడా విద్యుత్ బిల్లుల చెల్లింపులు

అరసవల్లి: విద్యుత్ వినియోగ చార్జీల బిల్లులు చెల్లించుకునేందుకు వీలుగా జిల్లాలో ఉన్న అన్ని విద్యుత్ శాఖ కార్యాలయాల్లో శని, ఆదివారాలు బిల్లు కలెక్షన్ కౌంటర్లు తెరిచే ఉంటాయని ఎస్ఈ ఎల్.దైవప్రసాద్ తెలియజేశారు. ఈ మేరకు వినియోగదారులు ఆయా పరిధిలోని కార్యాలయాల కౌంటర్లకు వెళ్లి తమ బిల్లులను చెల్లించుకోవచ్చునని ప్రకటించారు.

పరీక్షలు ఉచితం.. ఫలితాలు కచ్చితం

- అన్నదాతకు వెన్నుదన్నుగా వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ ల్యాబ్స్
- ఆగస్టు నుంచి పూర్తి వినియోగంలోకి..
- నియోజకవర్గానికి ఒక ల్యాబ్‌తో ఉత్తమసేవలు
- జిల్లాలో 7 ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌లు, ఒక జిల్లాస్థాయి ల్యాబ్ ఏర్పాటు
- ఉచితంగా పరీక్షల నిర్వహణ

ఫలానా ఎరువు వాడొచ్చా లేదా..? ఆ విత్తనాలు వేస్తే ఎలా ఉంటుందో..? పొలం మట్టిలో సారం ఎంత ఉందో ఏమిటో..? ఇలాంటి రైతుల సగటు సందేహాలకు మూడు రోజుల్లో సమాధానం ఇచ్చే వ్యవస్థను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వారాల తరబడి ఎదురుచూసే అగత్యం లేకుండా ఎక్కడికక్కడ పరీక్షలు నిర్వహించి ఫలితాలు ప్రకటించేలా వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ ల్యాబ్స్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఏడు నియోజకవర్గాలతో పాటు ఒక జిల్లాస్థాయి ల్యాబ్ ఆగస్టు నుంచి సేవలు అందించనున్నాయి. వ్యవసాయంతో పాటు పాడి, ఆక్వారంగాల వారికి సైతం సేవలు అందించనున్నాయి. పైగా ఇక్కడ పరీక్షలన్నీ పూర్తిగా ఉచితం.



కంచిలి:

అగ్రి'కల్చర్' మార్చేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం శతథా ప్రయత్నిస్తోంది. అధునాతన పరిజ్ఞానాన్ని సంప్రదాయ వ్యవసాయ పద్ధతులకు జోడించి అన్నదాతలకు మేలు చేకూర్చేలా నిర్ణయాలు తీసుకుంటోంది. అందులో భాగంగానే ప్రతి నియోజకవర్గంలో వైఎస్సార్ అగ్రిలాబ్స్‌ను నెలకొల్పింది. గతంలో విత్తనాలు, ఎరువులను పరీక్షించుకోవడానికి కనీసం నెల నుంచి రెండు నెలల సమయం పట్టేది. ఆ అవస్థ నుంచి తప్పిస్తూ ఈ ల్యాబ్‌లు రెండు నుంచి మూడు రోజుల్లోనే విత్తనాలు, ఎరువుల నాణ్యతలను ప్రకటించడంతో పాటు ఇతర పరీక్షలు కూడా చేస్తాయి. ఇప్పటికే రైతు భరోసా కేంద్రాలతో చాలా సేవలు రైతులకు సులువుగా చేరువయ్యాయి. ఇప్పుడు ఈ ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌లతో వ్యవ'సాయం' మరింత సులువు కానుంది.



సోంపేటలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ అగ్రిల్యాబ్



ల్యాబ్‌లో వ్యవసాయ పరీక్షలు చేస్తున్న సిబ్బంది

రూ.కోటిన్నర వ్యయంతో..

జిల్లాలోని ఏడు నియోజకవర్గాలతో పాటు జిల్లా కేంద్రంలో జిల్లాస్థాయి ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. ఒక్కో ల్యాబ్ నిర్మాణానికి రూ.కోటిన్నర ఖర్చు పెట్టారు. ఇక జిల్లాస్థాయిలో ఏర్పాటు చేసే ల్యాబ్ సుమారు రూ.3.5 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్నారు. జిల్లాస్థాయిలో ఏర్పాటు చేస్తున్న ల్యాబ్ నిర్మాణ దశలో ఉండగా, మిగతా ఏడు చోట్ల పూర్తిస్థాయిలో నిర్మాణాలు జరిగాయి. వీటి ద్వారా ఆగస్టు నుంచి అన్ని రకాల పరీక్షలు చేయడం ప్రారంభిస్తారు. జిల్లాలో నరసన్నపేట, పలాస నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ ల్యాబ్స్‌లో వ్యవసాయం, ఆక్వా పరిశ్రమకు సంబంధించిన పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే టెక్కలి, సోంపేటలలో గల ల్యాబ్స్‌లో వ్యవసాయం, ఆక్వా, పశు సంవర్ధకశాఖలకు సంబంధించిన పరీక్షల్ని చేస్తారు. ఎచ్చెర్ల, ఆమదాలవలస, పాతపట్నం నియోజకవర్గాల్లో అగ్రి, వెటర్నరీ ల్యాబ్స్‌ను ఏర్పాటు చేశారు. ఇక శ్రీకాకుళం సమీపంలోని అంపోలులో జిల్లాస్థాయి ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌ను సర్వహంగులతో ఏర్పాటు చేస్తున్నారు. ఈ ల్యాబ్ నియోజకవర్గస్థాయిలో నెలకొల్పిన ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌కు అనుబంధంగా పనిచేస్తుంది. ముఖ్యంగా పురుగు మందులు వంటివి పరీక్షించడానికి నియోజకవర్గాల నుంచి జిల్లా ల్యాబ్‌కు శాంపిళ్లు పంపిస్తారు. నియోజకవర్గ స్థాయి ప్రయోగ శాలలు రైతుల శాంపిల్స్‌ను పరీక్షించడమే కాకుండా చట్టపరమైన అంశాలను అనుసరించి నాణ్యత సరిగా లేని శాంపిల్స్‌ను మరోసారి జిల్లాస్థాయి ల్యాబ్‌లో పరీక్షిస్తారు.

వ్యవసాయానికి అండగా ..



వ్యవసాయ రంగానికి అండగా రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ ల్యాబ్స్‌ను ఏర్పాటు చేయడం సంతోషించదగ్గ విషయం. ఈ జిల్లాలో వ్యవసాయ రంగంతోపాటు ఆక్వా, పాడి రంగాల్లో రైతులు ఆధారపడి జీవిస్తున్నారు. అందుకు అనుగుణంగా ఆయా ప్రాంతాలను బట్టి ల్యాబ్‌లను ఏర్పాటు చేయడం మంచి పరిణామం.

– మద్దు వెంకటరావు, రైతు సంఘం ప్రతినిధి, కంచిలి మండలం

ఆగస్టు నుంచి..



ఆగస్టు నెల నుంచి వైఎస్సార్ అగ్రి ల్యాబ్స్ పూర్తిస్థాయి వినియోగంలోకి వచ్చేలా అన్ని ఏర్పాట్లు చేశాం. గతంలో చాలా ఆలస్యంగా పరీక్షల ఫలితాలు వచ్చేవి. ఇప్పుడు ల్యాబ్‌లు విరివిగా ఏర్పాటు చేయడం వలన ఆ సమస్య ఎదురుకాదు. ఆమదాలవలస ల్యాబ్‌లో ఇప్పటికే పరీక్షలు చేపడుతున్నాం. ఎప్పటికప్పుడు ఫలితాలు రావడం వల్ల రైతులు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు వాడటానికి వీలు పడుతుంది.

– కె.శ్రీధర్, జిల్లా వ్యవసాయ సంచాలకులు

ఎందుకీ ల్యాబ్‌లు..?

- గతంలో ఎరువులు, విత్తనాల నాణ్యతా పరీక్షల కోసం ఇతర జిల్లాలకు పంపాల్సి వచ్చేది. దీంతో అక్కడి నుంచి రిపోర్టు వచ్చేసరికి దాదాపుగా 30 నుంచి 45 రోజుల సమయం పట్టేది. దీంతో చాలా మంది రైతులు మార్కెట్‌లో కొన్న వాటిని పరీక్షించకుండానే వినియోగించి మోసపోయేవారు.
- ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌లతో అలాంటి దురవస్థలు ఇక ఉండవు.
- విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల నాణ్యతతో పాటు ఆక్వా సాగుచేసే రైతులు కూడా తాము చేపల సాగుకు వినియోగించే మట్టి, నీరు వంటివి ఇక్కడ పరీక్షించుకోవచ్చు. సీడ్, ఫీడ్ వంటి పరీక్షలు కూడా జరుగుతాయి.
- జిల్లాలో అధికశాతం మంది వ్యవసాయంతో పాటు మరోవైపు పాడి పరిశ్రమపైన కూడా ఆధారపడి జీవిస్తున్నారు. వీరు పశువులకు సంబంధించిన రక్తం, పేడ, వాటికి ఉండే రోగాలతో పాటు పాలు నాణ్యత వంటివి కూడా ఈ ల్యాబ్‌లలో పరీక్షించుకోవచ్చు.
- ఈ ల్యాబ్ పూర్తిగా వ్యవసాయ శాఖ ప్రాంతీయ వ్యవసాయ సంచాలకులు, ఇద్దరు వ్యవసాయాధికారుల పర్యవేక్షణలో పనిచేస్తుంది.

న్యూస్‌రీల్

ఆరోగ్యమే మహాభాగ్యం: ఎస్పీ



సిబ్బంది సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ రాధిక

ఎచ్చెర్ల క్యాంపస్: పోలీసు సిబ్బంది ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఎస్పీ జీఆర్ రాధిక అన్నారు. ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ రిజర్వు మైదానంలో శుక్రవారం ప్రత్యేక పరేడ్ కార్యక్రమం నిర్వహించారు. పరేడ్ పరిశీలించిన ఆమె, పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. పోలీసుల నైపుణ్యాలు పరిశీలించి, ప్రతి ఒక్కరితో వ్యక్తిగతంగా మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలీస్ శాఖలో ప్రతి ఒక్కరికీ ఫిట్‌నెస్ కీలకమని చెప్పారు. పోలీసులు శారీరకంగా, మానసికంగా ధృడంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు విఠలేశ్వర్, తిప్పేస్వామి, డీఎస్పీలు శృతి, బాలరాజు, ప్రసాదరావు, ఆర్ఐ ప్రదీప్ పాల్గొన్నారు.

టెక్కలి సబ్ కలెక్టర్‌కు జేసీగా పదోన్నతి

టెక్కలి: టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డిని నంద్యాల జేసీగా నియమిస్తూ సీఎస్ కె.ఎస్.జవహర్‌రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. గత ఏడాది అక్టోబర్ 16న టెక్కలి సబ్ కలెక్టర్‌గా రాహుల్‌కుమార్ రెడ్డి విధుల్లోకి చేరారు. సంతబొమ్మాళి మండలం మూలపేట పోర్టుకు సంబంధించి భూముల గుర్తింపు, నిర్వాసితులకు, రైతులకు పరిహారం చెల్లింపు తదితర విషయాల్లో కీలకంగా వ్యవహరించి తనదైన మార్క్ సాధించారు. అంతే కాకుండా టెక్కలి డివిజన్ పరిధిలో ప్రత్యేకంగా స్పందన కార్యక్రమాలు నిర్వహించి పలు సమస్యలను పరిష్కరించారు.

రైతులు నష్టపోకూడదు



అధికారులు,రైతులతో మాట్లాడుతున్న కృష్ణదాస్

జలుమూరు: వానలు, వంశధార కాలువకు గండి పడడంతో నష్టపోతున్నామని పాగోడు, కూర్మనాథపురం, గొటివాడ, గుగ్గిలి గ్రామాల రైతులు ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ముందు వాపోయారు. ఆయన శుక్రవారం నీట మునిగిన పంట పొలాలను వంశధార అధికారులతో కలిసి పరిశీలించారు. రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వంశధార డీఈఈ బాలక శ్రీహరి మాట్లాడుతూ ప్రస్తుతం తాత్కాలికంగా పనులు చేసి రైతులు ఇబ్బందులు తొలగిస్తామన్నారు. శాశ్వత పనులపై కలెక్టర్‌తో మాట్లాడాలని కృష్ణదాస్ సూచించారు. ఆయనతోపాటు ఏఈఈ సురేష్ కుమార్, వైస్ ఎంపీపీ తంగి మురళీకృష్ణ, ఎఓ సురేష్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఖాదీలో యువతకు శిక్షణ ఇవ్వాలి



నేత ప్రక్రియను పరిశీలిస్తున్న విశాఖ చాంబర్ ఆఫ్ కామర్స్ మహిళా విభాగం సభ్యులు

పొందూరు: ఖాదీ బతికి బట్టకట్టాలంటే ఈ పరిశ్రమలోకి యువత రావాలని విశాఖ చాంబర్ ఆఫ్ కామర్స్ మహిళా విభాగం అధ్యక్షురాలు ఈజీవల్సురాగ్ అన్నారు. ఆమె శుక్రవారం స్థానిక సన్న ఖాదీ కార్మికాభివృద్ధి సంస్థను సందర్శించారు. ఖాదీ, వడుకు నేతల ప్రక్రియలను పరిశీలించారు. పొందూరు సన్నఖాదీకి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింత ప్రోత్సాహకాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో విశాఖ మహిళా విభాగం వాకర్స్ క్లబ్ పూర్వ అధ్యక్షురాలు శిరీష, విశాఖ ఆరోహణ గిరిజన కార్యదర్శి సురేఖాపట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఈ-శ్రమ్ కార్డుతో భవితకు భరోసా

రణస్థలం: అసంఘటిత రంగంలో పనిచేసే వారికి ఈ-శ్రమ్ కార్డు భరోసా ఇస్తుందని శ్రీకాకుళం అసిస్టెంట్ లేబర్ ఇన్‌స్పెక్టర్ ఆర్.వి.శ్రీనివాసరావు అన్నారు. రణస్థలంలోని పలు దుకాణాల్లో పనిచేస్తున్న అసంఘటిత కార్మికులకు శుక్రవారం ఈ-శ్రమ్ కార్డులను నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసంఘటిత రంగంలో పనిచేసే వారికి ఎలాంటి ఈపీఎఫ్, ఈఎస్ఐ ఉండదని, అలాంటి వారికి ఆర్థిక, సామాజిక భద్రత అందించడానికి కేంద్ర ప్రభుత్వం 2021లో ఈ శ్రమ్ కార్డును తీసుకువచ్చిందని చెప్పారు. ఇందులో నమోదైన వారికి రూ. 2లక్షల జీవిత బీమా, లక్ష ప్రమాద బీమా వర్తిస్తుందని తెలిపారు.

పుట్టలో దేవతామూర్తుల విగ్రహాలు



పుట్టలో బయటపడిన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, నాగదేవత విగ్రహాలు

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి మండలం విశ్వనాథపురం కాలనీ సమీపంలోని ఆకు కొండపై ఉన్న ఒక పుట్టను శుక్రవారం గ్రామస్తులు తవ్వగా ఆ పుట్ట లోపల సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, నాగదేవత విగ్రహాలు బయటపడ్డాయి. తనకు కలలో దైవం కనిపించి పుట్టలో దేవతామూర్తుల విగ్రహాలు ఉన్నాయని, తవ్వి చూడాలని చెప్పాడని లక్ష్మీనారాయణస్వామి ఆలయం పూజారి గుగ్గిలం సతీష్ చెబుతున్నారు. ఆయన చెప్పిన మేరకే.. స్థానిక వీరభద్రస్వామి గుడి పూజారి శివస్వామితో పాటు గ్రామస్తులు పుట్టను తవ్వగా విగ్రహాలు బయటపడడంతో స్థానికులు వీటిని చూసేందుకు ఆసక్తి చూపించారు. ఇక్కడ ఆలయం నిర్మించనున్నట్లు తెలిపారు.

రక్త పింజరి హతం



గ్రామస్తులు హతమార్చిన రక్తపింజరి

మెళియాపుట్టి: మండల కేంద్రంలోని మెయిన్ రోడ్ సమీపంలో శుక్రవారం విషపూరితమైన రక్తపింజరిని గ్రామస్తులు హతమార్చారు. ఈ సర్పం ఇళ్ల వద్దకు వచ్చి అలజడి సృష్టించడంతో పిల్లలు భయపడి పరుగులు పెట్టారు. కొంతమంది ధైర్యం చేసి కర్రలతో కొట్టి హతమార్చారు.

సచివాలయాలతో సమూల మార్పులు

- రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు

కోటబొమ్మాళి:

సచివాలయ వ్యవస్థతో పాలనలో సమూల మార్పులు వచ్చాయని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. ఆయన శుక్రవారం కోటబొమ్మాళి మండలం రేగులపాడులో రూ.80 లక్షల వ్యయంతో కొత్తగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని పార్టీలు ఏకమైనా రానున్న ఎన్నికల్లో వైఎస్ జగనే మళ్లీ సీఎం అవుతారని స్పష్టం చేశారు. కరోనా సమయంలో వలంటీర్ల సేవలు మరువలేనివని తెలిపారు. సచివాలయ భవనాలను ఎంతో నాణ్యతగా అందంగా నిర్మించిన రేగులపాడుకు చెందిన వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ దుంగ శిమ్మన్నను మంత్రి అభినందించారు. అంతకుముందు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికి సీఎం కష్టపడుతుంటే చంద్రబాబు, పవన్ కల్యాణ్ కుయుక్తులు పన్నుతున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు దోచుకుతిన్నాయని, అలాంటి పరిస్థితులు రాకూడదనే వలంటీర్ వ్యవస్థతో పౌరసేవలను అవినీతి లేకుండా సీఎం వైఎస్ జగన్ అందజేస్తున్నారని అన్నారు. టెక్కలి వైఎస్సార్ సీపీ సమన్వయకర్త దువ్వాడ వాణి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి అహర్నిశలూ కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దుబ్బ వెంకటరమణారావు, పీఏసీఎస్ అధ్యక్షుడు బాడాన మురళి, వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ దుంగ శిమ్మన్న, వైస్ ఎంపీపీలు బోయిన నాగేశ్వరరావు, దుక్క రోజారాణి, కోటబొమ్మాళి మండల ప్రత్యేక ఆహ్వానితులు రోణంకి మల్లయ్య, సర్పంచ్‌లు నూక సత్యరాజ్, పేడాడ ప్రసాద్, సుంకరి జనార్దన, బొడ్డు వెంకటరమణ, ఎంపీటీసీ దుంగ శ్రీదేవి, అన్నెపు రామారావు, జిల్లా రైతు సమాఖ్య సభ్యుడు కవిటి రామరాజు, జేసీఎస్ మండల ఇన్‌చార్జి జి.నాగభూషణరావు, జేసీఎస్ కన్వీనర్లు తర్ర కామినాయుడు, బమ్మిడి శ్రీనివాసరావు, మండల కో ఆప్షన్ సభ్యుడు రాజుభాయ్ తదితరులు పాల్గొన్నారు.



రేగులపాడులో సచివాలయ భవనాలను ప్రారంభిస్తున్న రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ):

మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షిద్దామని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. గ్రీన్ ఎర్త్.. గ్రీన్ ఆంధ్రప్రదేశ్ నినాదంతో ఐఏఎస్ ఆఫీసర్స్ వైఫ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కంపోస్టు కాలనీలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కాలుష్యం పెరిగిన నేపథ్యంలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు జూలై 28న ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. కలెక్టర్ సతీమణి శైలి లాఠకర్ మాట్లాడుతూ జిల్లాలో 16,420 మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ ఓబులేసు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ దంపతులు

అన్ని వర్గాల వారికీ న్యాయం

- స్పీకర్ తమ్మినేని సీతారాం

బూర్జ: తమ ప్రభుత్వం అన్ని వర్గాల వారికీ సంక్షేమం అందించిందని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. బూర్జ మండలం హరిపురంలో సుమారు రూ.7 లక్షలు, తుడ్డలిలో సుమారు రూ. 41 లక్షలు, డొంకల పర్త గ్రామంలో రూ.55 లక్షల నిధులతో జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ మంచినీటి పథకానికి శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. డొంకలపర్త గ్రామంలో సుమారు రూ.5 లక్షలు గడపగడపకూ మనప్రభుత్వం నిధులతో నిర్మించిన వాటర్‌ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. అలాగే అదే గ్రామంలో ఫిష్ ఆంధ్రా ఫిట్ ఆంధ్రా కార్యక్రమంలో మినీ మొబైల్ వాహనాన్ని ప్రారంభించారు. జగనన్న అధికారంలోకి వచ్చాక అందరికీ సంక్షేమం అందుతోందని, అంతా బాధ్యతగా ఉండాలని అన్నారు. మళ్లీ వైఎస్ జగన్‌ను సీఎం చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బెజ్జిపురపు రామారావు, మండల ప్రత్యేక ఆహ్వానితుడు కర్నేన నాగేశ్వరరావు, ఖండాపు గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.



తుడ్డలిలో జలజీవన్ మిషన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

సంక్షేమంతోనే వృద్ధిరేటు పెరుగుదల

- పాతపట్నం నియోజకవర్గ సమీక్షలో మంత్రి బొత్స సత్యనారాయణ
- ధాన్యం సేకరణలో జిల్లాకు రెండో స్థానం: కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్
- పాతపట్నంలో కిడ్నీ వ్యాధులపై ప్రత్యేక దృష్టి సారించాలి : ఎమ్మెల్యే రెడ్డి శాంతి



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి బొత్స సత్యనారాయణ, చిత్రంలో జెడ్పీచైర్‌పర్సన్ పిరియా విజయ, కలెక్టర్ శ్రీకేష్ బి. లాఠకర్, ఎమ్మెల్యేలు రెడ్డి శాంతి, కృష్ణదాస్, ఎమ్మెల్సీ నర్తు రామారావు

అరసవల్లి: డీబీటీ ద్వారా లబ్ధిదారుల ఖాతాల్లోకి నేరుగా సంక్షేమ ఫలాలు అందించడం వల్ల రాష్ట్ర ఆర్థిక వృద్ధి రేటు పెరిగిందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. శ్రీకాకుళంలోని జెడ్పీ సమావేశ మందిరంలో శుక్రవారం పాతపట్నం నియోజకవర్గం అభివృద్ధిపై ఆయన సమీక్షించారు. తమ ప్రభుత్వం అధికంగా అప్పులు చేసిందని చెబుతున్న విపక్షాలు.. ఈ అప్పులు చేసింది పేదోళ్ల ఆకలి తీర్చడానికి.. వారి జీవన ప్రమాణాలు పెంచడానికనే విషయాన్ని గమనించాలని సూచించారు. దేశంలో మనకంటే ఎక్కువ అప్పులు చేసిన రాష్ట్రాలు చాలా ఉన్నాయన్నారు. లబ్ధిదారులకు నేరుగా సంక్షేమాలు అందించడం వల్ల స్థానిక నేతలకు కూడా గౌరవం పెరుగుతోందని వివరించారు. ఈ నియోజకవర్గ సమీక్షలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, జేసీ ఎం.నవీన్, టెక్కలి సబ్‌కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి, సీపీఓ లక్ష్మీ ప్రసన్న, జెడ్పీ సీఈఓ ఆర్.వెంకట్రామన్ పాల్గొన్నారు.

గడప గడపకూ వినతులకు అత్యంత ప్రాధాన్యత

గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో అందుతున్న వినతులకు అధికారులు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి సమస్యలన్నీ పరిష్కరించాలని, అడిగిన మేరకు పనులు చేపట్టాలని మంత్రి బొత్స ఆదేశించారు. ఒక్క పాతపట్నం నియోజకవర్గంలో ఐదు మండలాల మహిళల ఖాతాల్లోకి డీబీటీ ద్వారా ఈ ఐదేళ్ల పాలనలో సుమారు రూ.1500 కోట్లు వరకు జమైందని, ఒక్క నియోజకవర్గంలోనే ఇంత మొత్తంలో జమ కావడం గతంలో ఎన్నడూ చూడనిదన్నారు. జిల్లాకు కొత్తగా మంజూరైన ఐదు పీహెచ్‌సీల్లో మెట్టూరు, తురకపేటల్లో రెండు పీహెచ్‌సీలు ఇదే నియోజకవర్గానికి చెందినవని, అయితే నిర్మాణాలకు అడ్డంగా కేసులు వేశారని గుర్తుచేశారు. హౌసింగ్ విషయంలో అర్హులై ఉండి, ఇంతవరకు శ్లాబులు పూర్తిచేయని గత పథకాల లబ్ధిదారులకు కూడా మేలు చేసేలా త్వరలోనే ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేయనుందని ప్రకటించారు.

కేంద్రంపై అవిశ్వాసానికి మా మద్దతు ఉండదు

కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టే ప్రక్రియలో వైఎస్సార్‌సీపీ మద్దతు ప్రకటించబోదని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ స్పష్టం చేశారు. అవిశ్వాస తీర్మానం విషయంలో తమ పార్టీ స్టాండ్‌ను ఇప్పటికే స్పష్టం చేశారని, రెండు నాలుకల చంద్రబాబే ఆయన పార్టీ స్టాండ్‌ను ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని గుర్తుచేశారు. పోలవరం జాతీయ ప్రాజెక్టు అని తెలిసినా..కేవలం కాంట్రాక్టుల కోసం అక్రమార్జన కోసం హడావుడి చేశారని, పోలవరం జాప్యానికి చంద్రబాబే కారణమయ్యాడని వివరించారు.

పాతపట్నంపై వరాలు..

పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి మాట్లాడుతూ పాతపట్నం నియోజకవర్గానికి నిధుల కేటాయింపు విషయంలో జగనన్న వరాలు అందించారని కొనియాడారు. దీంతో వ్యవసాయం, ఇరిగేషన్ పరంగా అద్భుతంగా పనులు జరుగుతున్నాయన్నారు. ఉద్దానం మంచినీటి పథకంలో భాగంగా రూ.265 కోట్లతో ఎల్ఎన్‌పేట, మెళియాపుట్టి మండలాలకు కూడా తాగునీటికి అందించేలా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు కూడా నిధులు కేటాయించారన్నారు. మెళియాపుట్టి, కొత్తూరు మండలాల్లో కూడా కిడ్నీ వ్యాధులు పెరుగుతున్నాయని, ఒక్క దిమిలి గ్రామంలోనే అధికంగా నమోదవుతున్నాయని, దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆమె కోరారు.

ఆర్‌బీకేలు సూపర్

కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ధాన్యం కొనుగోలులో జిల్లాకు రెండో స్థానం దక్కిందన్నారు. పాతపట్నం నియోజకవర్గంలో దిమిలి తదితర గ్రామాల్లో ప్రజలందరికీ క్రియాటిన్ లెవెల్ పరీక్షలను చేయించి సర్వే చేపట్టాలని డీఎంహెచ్ఓ మీనాక్షిని ఆదేశించారు. జిల్లాలో వర్షాలతో సుమారు 5400 హెక్టార్ల మేర వరిపంట మునిగిపోయిందని.. నష్టం అంచనాలు తయారు చేయాలన్నారు.

క్లుప్తంగా

ప్రశ్నపత్రం మార్పు తగదు

శ్రీకాకుళం న్యూకాలనీ: తెలుగు భాషకు వెన్నుదన్నుగా నిలిచి కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని వేదన రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పిసిని వసంతరావు, కూన రంగనాయకులు, ప్రతినిధులు కుప్పన్నగారి శ్రీనివాసరావు, చింతపల్లి జనార్దనరావు, రఘుపాత్రుని శ్రీనివాసరావు, గోడబ మేరీప్రసాద్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల ప్రశ్నపత్రంలో చోటు చేసుకున్న ఉదాంతాలతో తెలుగుభాష కనుమరుగయ్యే ప్రమాదముందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే పూర్వ ప్రశ్నపత్రాన్నే అమలు చేస్తూ, బ్లూ ప్రింట్ విడుదల చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

మందసలో ఆర్టీసీ పార్శిల్ కౌంటర్ ప్రారంభం



కౌంటర్‌ను ప్రారంభిస్తున్న అసిస్టెంట్ మేనేజర్ సంతోష్‌కుమార్

మందస: మందస పట్టణంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ సమీపంలో సంతోషి మాత ఆలయం ఎదురుగా ఏపీఎస్ ఆర్టీసీ పార్శిల్ కౌంటర్‌ను శుక్రవారం పలాస డిపో అసిస్టెంట్ మేనేజర్ పి.సంతోష్‌కుమార్ ప్రారంభించారు. సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో డిపో డీఎంఈ ముకుందరావు, డి.శ్రీనివాసరావు, పార్శిల్ కౌంటర్ నిర్వాహకుడు మడియా కృష్ణ వర్మ పాల్గొన్నారు.

నోట్ల మార్పిడి ముఠాతో జాగ్రత్త



ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : రెండు వేల రూపాయల నోట్లు రద్దు నేపథ్యంలో కొందరు వ్యక్తులు అసలు నగదు కంటే అదనంగా ఇస్తామని ఆశచూపి మోసగిస్తున్నారని, అటువంటి వారిపట్ల జాగ్రత్తగా ఉండాలని ఎస్పీ జి.ఆర్.రాధిక శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రూ. 500 నోట్లు కట్టలు అందిస్తే అంతకు పదిశాతం కలిపి రూ. 2 వేల నోట్ల కట్టలు అందిస్తామని మాయమాటలు చెప్పి మోసగిస్తున్నారని తెలిపారు. ఇలాంటి సంఘటన ఈ నెల 23న కాశీబుగ్గ పీఎస్ పరిధిలో జరిగిందని పేర్కొన్నారు. అపరిచిత వ్యక్తుల సమాచారాన్ని పోలీసు అధికారులకు అందివ్వాలని ఎస్పీ కోరారు.

సమయపాలన పాటించాలి



హాజరును పరిశీలిస్తున్న డీసీహెచ్ భాస్కరరావు

నరసన్నపేట: వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి భాస్కరరావు అన్నారు. శుక్రవారం నరసన్నపేట వంద పడకల ఆసుపత్రిని పరిశీలించారు. వైద్యుల హాజరు, ఓపీ సేవలపై ఆరా తీశారు. సివిల్ సర్జన్లు, అసిస్టెంట్ సివిల్ సర్జన్లతో పాటు వివిధ రకాల వైద్య నిపుణులు ఉన్నప్పటికీ సేవలు పెరగకపోవడాన్ని గుర్తించారు. కొందరు డాక్టర్లు ఓపీ కూడా బాధ్యతగా చూడటం లేదని, కొందరు వైద్యులు నచ్చిన సమయాల్లో వస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయని, ఇది కొనసాగించడం మంచిదికాదన్నారు. ప్రతిఒక్కరూ ఆరోగ్య శ్రీ కేసులు చూడాలన్నారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ జయశ్రీకి పలు సూచనలు చేశారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24క్యా. 10గ్రా.)	60,160-00
బంగారం(22క్యా. 10గ్రా.)	55,150-00
వెండి (కిలో)	80,400-00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹210	₹ 220

డ్రాపౌట్లకూ సర్టిఫికెట్లు..!

- ట్రిపుల్ ఐటీల్లో జాతీయ నూతన విద్యా విధానం అమలు
- మధ్యలో మానేసిన విద్యార్థులు నష్టపోకుండా ధ్రువపత్రాల జారీ
- సెమిస్టర్ ఆధారంగా సర్టిఫికెట్ల అందజేత
- వాటితో తదుపరి కోర్సులు, ఉద్యోగాల్లో చేరేందుకూ అవకాశం



క్లాస్ వర్కులో విద్యార్థులు

ఎచ్చెర్ల క్యాంపస్:

ఉన్నత విద్యలో డ్రాపౌట్లు ప్రధాన సమస్యగా ఉంటోంది. ఇంజినీరింగ్‌లో చేరాక మధ్యలో ఉద్యోగాలు రావడం, జాతీయ స్థాయి సంస్థల్లో ప్రవేశాలకు అవకాశం రావడం, చదువుపై ఆసక్తి లేకపోవడం తదితర కారణాలతో చాలామంది విద్యార్థులు మధ్యలోనే మానేస్తున్నారు. అయితే ఇంజినీరింగ్‌లో నాలుగేళ్లు చదివితేనే డిగ్రీ పట్టా చేతికి వస్తుంది. దీంతో డ్రాపౌట్లు ఎలాంటి సర్టిఫికెట్లు పొందలేకపోయేవారు. ఈ సమస్యకు జాతీయ నూతన విద్యా విధానం పరిష్కారం చూపుతుంది. విద్యార్థులు మధ్యలో చదువు ఆపేస్తే అంతవరకు వారు చదివిన విద్యార్హతను బట్టి సర్టిఫికెట్లు ఇవ్వాలని నిర్ణయించింది. ఈ విధానాన్ని ట్రిపుల్‌ఐటీలో ఈ సంవత్సరం నుంచే అమలు చేయనున్నారు. రాష్ట్రంలో రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయాలు శ్రీకాకుళం, ఇడుపులపాయ, ప్రకాశం, నూజివీడులో ఉండగా, ఏటా 4400 మందికి ప్రవేశాలు కల్పిస్తున్నారు. క్యాంపస్‌లో 1100 మంది చొప్పున ప్రవేశం పొందుతున్నారు. 10వ తరగతిలో టాపర్లు ఈ సంస్థల్లో సీట్లు పొందుతున్నారు.

విద్యార్థులకు నష్టం లేకుండా..

ట్రిపుల్ ఐటీల్లో సమీకృత ఇంజినీరింగ్ కోర్సు ఆరేళ్లు. రెండేళ్ల పీయూసీ (ప్రీ యూనివర్సిటీ కోర్సు), నాలుగేళ్లు ఇంజినీరింగ్ కోర్సు. మొత్తం ఆరేళ్లు విద్యార్థులు చదవాల్సి ఉంటుంది. పీయూసీ ఇంటర్మీడియట్‌తో సమాన విద్య. ఈ విద్య తరువాత కొందరు విద్యార్థులు రిలీవ్ అవుతున్నారు. జేఈఈ ర్యాంకులు, ఇతర జాతీయ విద్యా సంస్థల్లో ప్రవేశాలు లభించటం ఇందుకు కారణం. పీయూసీ తర్వాత విద్య ఆపేసిన విద్యార్థులకు నష్టం ఉండదు. దీని అర్హతతో డిగ్రీ, ఇతర విద్యాకోర్సుల్లో సైతం చేరవచ్చు. నాలుగేళ్ల ఇంజినీరింగ్ కోర్సుల్లో చేరిన విద్యార్థులు మాత్రం మధ్యలో మానేస్తే నష్టపోవాల్సి ఉంటుంది. వీరిని డిస్‌కంటిన్యూ కింద పరిగణిస్తారు. అయితే నూతన విద్యా విధానం అమలులతో ఇలాంటి విద్యార్థులకు నష్టం ఉండదు. నాలుగేళ్ల ఇంజినీరింగ్ పూర్తిచేస్తేనే బీటెక్ డిగ్రీ, మధ్యలో ఆపేస్తే విద్యార్హత బట్టి సర్టిఫికేట్ కోర్సు, ఇంజినీరింగ్ డిప్లమా కోర్సు, ఇంజినీరింగ్ పీజీ డిప్లమా కోర్సు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తారు. ఈ సర్టిఫికెట్లతో ఉద్యోగ అవకాశాలు సైతం అందిపుచ్చుకోవచ్చు. విద్యార్థులకు డిస్‌కంటిన్యూ అన్న సమస్య ఉండదు.

అమలుకు కసరత్తు..

ట్రిపుల్ ఐటీల్లో ఈ ఏడాది నుంచి జాతీయ నూతన విద్యా విధానం మార్గదర్శకాల అమలుకు కసరత్తు చేస్తున్నారు. పీయూసీ రెండేళ్లలో నాలుగు సెమిస్టర్లు, ఇంజినీరింగ్ నాలుగేళ్లలో ఎనిమిది సెమిస్టర్లు ఉంటాయి. విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు లభించినా, విద్య కొనసాగించలేకపోయినా విద్య నిలిపివేసే నాటికి ఉన్న విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు అందజేస్తారు.

ఈ ఏడాది నుంచే..



ఆర్‌జీయూకేటీలో ఈ ఏడాది నుంచి జాతీయ నూతన విద్యా విధానం అమలు చేస్తాం. విద్యార్థుల డ్రాపౌట్ సమస్య ఉండదు. పీయూసీ పూర్తి చేసిన విద్యార్థి ఇంజినీరింగ్‌లో చేరాక, తాను పూర్తిచేసిన సెమిస్టర్లు బట్టి విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు అందజేస్తాం. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది ఉండదు.

– ప్రొఫెసర్ కె.సి.రెడ్డి, ఆర్‌జీయూకేటీ చాన్సలర్.

డ్రాపౌట్ సమస్య ఉండదు



అన్ని సంస్థల్లోనూ డ్రాపౌట్ సమస్య ఉంది. ఇంజినీరింగ్ వంటి విద్యలో నాలుగేళ్లు చదివితేనే డిగ్రీ వస్తుంది. ఏవైనా కారణాల వల్ల చదువు కొనసాగించపోతే విలువైన జీవితం నష్టపోవాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో నూతన విద్యా విధానం డ్రాపౌట్ సమస్యకు పరిష్కారం చూపుతుంది. చదివిన వరకు ధ్రువీకరణ పత్రం అందుతుంది.

– ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వరరావు, డైరెక్టర్, శ్రీకాకుళం క్యాంపస్

కౌన్సెలింగ్‌కు హాజరు కాని విద్యార్థులకు మరో అవకాశం

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ) ప్రవేశాలకు ఈ నెల 26, 27 తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వహించారు. 1100 సీట్లకు, ఎన్‌సీసీ, స్పోర్ట్స్ అండ్ గేమ్స్ సీట్లు ప్రకటించలేదు. మొత్తం 1088 మంది విద్యార్థులకు కాల్ లెటర్లు పంపించగా, 900 మంది విద్యార్థులు హాజరయ్యారు. 186 మంది హాజరు కాలేదు. హాజరు కాని విద్యార్థులకు మరో అవకాశం కల్పిస్తూ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు రాష్ట్ర చాన్సలర్ ప్రొఫెసర్ కె.సి.రెడ్డి శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. నాలుగు క్యాంపస్‌లలో (శ్రీకాకుళం, ఇడుపులపాయ, ప్రకాశం, నూజివీడు) మొదటి విడత కౌన్సెలింగ్‌కు హాజరు కాని వారు ఆసక్తి ఉంటే మరోసారి ఇచ్చిన అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. విద్యార్థులు జాబితా డబ్ల్యూ.డబ్ల్యూ.డబ్ల్యూ.ఆర్‌జీయూకేటీ.ఇన్ వెబ్ సైట్‌లో అందుబాటులో ఉంచారు. రెండో కౌన్సెలింగ్‌కు హాజరైతే ప్రవేశాలు కల్పిస్తారు. ప్రవేశాలపై ఆసక్తి ఉన్న వారు సైతం పేర్లు నమోదు చేసుకునే అవకాశం కల్పించారు. సీట్లు లభించిన విద్యార్థులు క్యాంపస్ మారాలనుకున్నా వెబ్‌సైట్‌లో మార్పు నమోదు చేసుకునే అవకాశం కల్పించారు. క్యాంపస్ మారాలనుకునే విద్యార్థులు నమోదు ఆధారంగా సీటు లభించిన క్యాంపస్‌లో సీటు రద్దు, వారు ఆప్షన్ ఇచ్చిన క్యాంపస్‌లో సీటు లభిస్తుంది. మార్పు కోరుకునే వారు మొదట సీటు పొందిన క్యాంపస్‌లో ప్రవేశాలు కోల్పోతారు. రిజిస్ట్రేషన్, క్యాంపస్ మార్పు లింక్‌లు ఆగస్టు 1 నుంచి అందుబాటులో ఉంటాయి. ఎంపిక జాబితా ఆగస్టు నాలుగున వెబ్‌సైట్‌లో ఉంటుంది. రెండో విడత కౌన్సెలింగ్ ఆగస్టు 9, 10 తేదీల్లో నూజివీడు క్యాంపస్‌లో ఉంటుందని అధికారులు తెలిపారు.

జీడి రైతుల సత్యాగ్రహ దీక్ష ప్రారంభం



దీక్షలో పాల్గొన్న జీడి రైతులు

కాశీబుగ్గ: జీడిపిక్కల ధర పాతాళానికి పడుతుంటే జీడిపప్పు ధర ఆకాశాన్ని అంటుతుందని, దీనిని ఆరోపణగా పరిగణించకుండా ఆలోచన చేయాలని పూర్వ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ అన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద ఏపీ జీడి రైతు కూలీ సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్‌కుమార్ అధ్యక్షతన శుక్రవారం 'జీడి సత్యాగ్రహం' పేరిట 24 గంటల దీక్ష ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్దాన రైతులను వదిలేసి విదేశీపప్పును ప్రోత్సహించడం న్యాయం కాదన్నారు. ఉద్దాన జీడిపప్పు సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి బస్తాకు రూ.16 వేలు గిట్టుబాటు ధర ఇచ్చి ఆర్‌బీకేలో కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. 2019లో 80 కేజీల జీడిపిక్కల బస్తా రూ.14వేలకు కొనుగోలు చేసి ఇప్పుడేమో రూ.7 వేల చెల్లిస్తామనడం తగదన్నారు. సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.మోహనరావు మాట్లాడుతూ జీడి బోర్డు, జీడి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. మార్పు ట్రస్టు అధ్యక్షుడు మట్ట ఖగేశ్వరరావు మాట్లాడుతూ న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి తేజేశ్వరరావు, కోనారి మోహనరావు, కొర్ల హేమారావు, పోతనపల్లి కుసుమ, కొర్లాన బాలాజీరావు, సవర కుమార్, జీడి కార్మిక సంఘ నాయకులు కోనేరు భీమారావు, బొమ్మాళి తాతయ్య, అంబటి ఆనందరావు, వంకల మాధవరావు, తామాడ త్రిలోచన, జన్ని భాగ్యలక్ష్మి, మద్దిల రామారావు, దుమ్ము లక్ష్మణరావు, గణపతి తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర వేడుకలకు ఏర్పాట్లు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్. చిత్రంలో ఎస్పీ రాధిక, జేసీ నవీన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా కేంద్రంలో స్వాతంత్య్ర వేడుకలు ఘనంగా నిర్వహించాలని, అందుకు యంత్రాంగం సిద్ధం కావాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఆదేశించారు. పంద్రాగస్టు వేడుకల నిర్వహణపై ఆయన శుక్రవారం తన కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో ఉదయం 9 గంటల నుంచి వేడుకలు ప్రారంభమవుతాయని, ఈ సందర్భంగా 'మేరా మిట్టి మేరా దేశ్' అంటూ ప్రతి గ్రామ పంచాయతీలో 75 మొక్కలు నాటాలని, అలాగే ఒక పైలాన్ ఏర్పాటు చేయాలని అన్నారు. దేశం కోసం అమరులైన వారిని స్మరించుకోవాలని, విశ్రాంత ఉద్యోగులను సన్మానించాలని చెప్పారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి పతాకావిష్కరణ చేస్తారని, అనంతరం ప్రసంగం, స్వాతంత్య్ర సమరయోధులతో పరిచయ కార్యక్రమం, మాక్ డ్రిల్, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రశంసా పత్రాలు పంపిణీ తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగుల వివరాలు అందజేయాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, శకటాలు, స్టాళ్ల ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, ఎస్పీ జీఆర్ రాధిక, అటవీశాఖ అధికారి నిషాకుమారి, ఇన్‌చార్జి జిల్లా రెవెన్యూ అధికారి మురళీకృష్ణ, రెవెన్యూ డివిజనల్ అధికారి బొడ్డేపల్లి శాంతి, నగర పాలక సంస్థ కమిషనర్ ఓబులేసు, డీఎస్‌ఓ వెంకటరమణ, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి బి.మీనాక్షి, జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వహణాధికారి వెంకట్ రామన్, గృహ నిర్మాణ సంస్థ పథక సంచాలకులు ఎం.గణపతిరావు, మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీలపై దాడులు అరికట్టాలి



నిరసన తెలియజేస్తున్న దళిత, ఆదివాసీ, ప్రజా సంఘాల నేతలు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): మణిపూర్‌లో ఆదివాసీలపై జరుగుతున్న మారణహోమంపై రాష్ట్రపతి మౌనం వీడాలని, రాష్ట్రంలో శాంతి నెలకొల్పే ప్రయత్నాలు చేయాలని, సీఎంను బర్తరఫ్ చేయాలని దళిత, ఆదివాసీ, మైనార్టీ సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు శుక్రవారం శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ కూడలిలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలను వివస్త్రలను చేసి ఊరేగించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నల్లి ధర్మారావు, అట్టాడ అప్పలనాయుడు, సన్నశెట్టి రాజశేఖర్, సామాజిక న్యాయ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కల్లేపల్లి రాంగోపాల్, సామాజిక న్యాయ పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి డి.గణేష్, కులనిర్మూలాన పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు మిస్కా కృష్ణయ్య, పిట్ట చంద్రపతిరావు, షా, ఎజ్రా, కల్లేపల్లి రాంగోపాల్, పోతల దుర్గారావు, శ్యాం, బెలమర ప్రభాకర్, రాకోటి రాంబాబు, తాండ్ర ప్రకాష్, కృష్ణవేణి, నేతల అప్పారావు, బోసు మన్మధరావు తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక అవసరాలు గుర్తించాలి



మాట్లాడుతున్న వీసీ నిమ్మ వెంకటరావు

ఎచ్చెర్ల క్యాంపస్: ఇంజినీరింగ్ విద్యార్థులు పారిశ్రామిక అవసరాలు గుర్తించాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు అన్నారు. వర్సిటీలో శుక్రవారం ఇంజినీరింగ్ కళాశాల సీఎస్‌ఈ విభాగం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయి ఉద్యోగాల్లో స్థిరపడాలన్నారు. నైపుణ్యాలు పెంచుకోవాలని సూచించారు. కన్సల్టింగ్ ఎట్ పెర్మినెంట్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్(హైదరాబాద్) డైరెక్టర్ రవివర్మ మాట్లాడుతూ మాట్లాడుతూ ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ రంగంలో ఉపాధి అవకాశాలు విస్తరిస్తున్నాయని చెప్పారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్‌ఏ రాజేంద్రప్రసాద్, ప్రిన్సిపాల్స్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య, ప్రొఫెసర్ చింతాడ రాజశేఖర్‌రావు, డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్య తలెత్తితే..

సాక్షి, విశాఖపట్నం : వర్షాల కారణంగా విద్యుత్ సరఫరాలో కలుగుతున్న అంతరాయాలను పర్యవేక్షించడానికి జిల్లా కేంద్రాలలో ఉన్న సూపరింటెండింగ్ ఇంజనీర్ల కార్యాలయాలు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్/టెక్నికల్ నియంత్రణలో ప్రత్యేక పర్యవేక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఏపీ ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి శుక్రవారం తెలిపారు. టోల్ ఫ్రీ నంబర్ 1912కు అదనంగా ఈ కేంద్రాలు పనిచేస్తాయని వివరించారు. సరఫరాలో అంతరాయాలు, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతినడం, ఇతర సరఫరా సంబంధిత సమస్యలు పరిష్కరించేందుకు శ్రీకాకుళం జిల్లాకు సంబంధించి సూపరింటెండింగ్ ఇంజనీర్ ఆపరేషన్ సర్కిల్, శ్రీకాకుళం నంబర్: 9440812386కు ఫిర్యాదు చేయవచ్చన్నారు.

పొదల్లో గంజాయి బ్యాగులు లభ్యం



గంజాయి స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

మెళియాపుట్టి : మండలంలోని ఆంధ్రా ఒడిశా సరిహద్దులో గొప్పిలి గ్రామ పెట్రోల్ బంక్ (కొల్లాని చెరువు గట్టు) పరిసరాల్లోని పొదల్లో మూడు బ్యాగులతో గంజాయి లభ్యమైంది. ఎస్సై రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం ఉదయం గొప్పిలి గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు పొదల్లో బ్యాగులు ఉండటం గమనించి వీఆర్వోకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. బ్యాగుల పరిశీలించగా గంజాయి ఉన్నట్లు గుర్తించారు. పోలీసులు, డీటీ శంకర్ ఆధ్వర్యంలో తూకం వేయగా 16 ప్యాకెట్లలో 33 కేజీలు ఉన్నట్లు తేలింది. దీనిపై స్థానికులను ఆరాతీశారు. గురువారం అర్ధరాత్రి సమయంలో గంజాయి తరలిస్తున్న వ్యక్తులకు పోలీసులు గస్తీ నిర్వహిస్తున్న సైరన్ వినిపించడంతో పొదల్లో విసిరేసి వెళ్లిపోయి ఉండొచ్చని ఎస్సై రాజేష్ చెబుతున్నారు. ఒడిశాకు చెందిన వారై ఉండొచ్చని అనుమానిస్తున్నారు. నిందితుల కోసం గాలిస్తున్నామని ఎస్సై తెలిపారు.

విద్యార్థులకు సాంకేతిక విద్య



లంకపేట కేజీబీవీలో భోజనాన్ని పరిశీలిస్తున్న ఆర్జేడీ జ్యోతికుమారి

రణస్థలం: కేజీబీవీ విద్యార్థినులకు సాంకేతిక పరిజ్ఞానం కలిగిన విద్య అందించాలని ఆర్‌జేడీ మణిపాత్రుని జ్యోతికుమారి తెలిపారు. రణస్థలం మానవ వనరుల కార్యాలయం, లంకపేట కేజీబీవీ పాఠశాలను శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐఎఫ్‌పీ(ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్) సాంకేతిక విద్యను బలోపేతం చేయాలన్నారు. క్రమశిక్షణతో కూడిన విద్య అందించాలని సూచించారు. జగనన్న విద్యాకానుక, మధ్యాహ్న భోజనం అమలుపై ఆరా తీశారు. రికార్డులు పరిశీలించి సిబ్బందికి సూచనలందించారు. కార్యక్రమంలో ఎంఈఓ ఏ.త్రినాథరావు, కేజీబీవీ ప్రిన్సిపాల్ హైమావతి, సీఆర్‌పీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

గెడ్డలో యువకుడు గల్లంతు



లోకేష్(ఫైల్)

రణస్థలం: మండలంలోని పైడిభీమవరం పంచాయతీ దేవునిపాలస వద్ద చిట్టిగెడ్డలో దేబారి లోకేష్(14) అనే యువకుడు గల్లంతయ్యాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలం పినతరిమి గ్రామానికి చెందిన దేబారి లోకేష్ బొప్పడాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. శుక్రవారం సెలవు కావడంతో బొప్పడాం సమీపంలోని వల్లూరులో క్రికెట్ ఆడేందుకు వెళ్లాడు. అక్కడి నుంచి దేవునిపాలవలసలో స్నేహితుల ఇంటికి వెళ్లాడు. దేవునిపాలవలస కనిమెల్ల గ్రామాల మధ్య చిట్టిగెడ్డలో స్నానం చేసేందుకు ఉదయం 11.30 గంటలకు దిగి గల్లంతయ్యాడు. స్నేహితులు గెడ్డలో గాలించిన లోకేష్ ఆచూకీ తెలియలేదు. తండ్రి దేబారి మహేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జె.ఆర్.పురం ఎస్సై జి.రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వివాహిత మృతి

టెక్కలి: ఈ నెల 24న గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన టెక్కలి మండలం చిన్నరోకళ్లపల్లికి చెందిన తామరాపల్లి రమాకుమారి(24) శుక్రవారం విశాఖలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో మృతి చెందారు. టెక్కలి ఎస్ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. రామాకుమారి భర్త గిరి కొంత కాలంగా దుబాయ్‌లో ఉంటూ ఇటీవల స్వగ్రామానికి వచ్చాడు. ఆర్థిక ఇబ్బందులు ఉండడంతో మరోసారి దుబాయ్ వెళ్లేందుకు నిర్ణయించుకున్నాడు. అది ఇష్టం లేక భార్య రమాదేవి భర్తతో గొడవకు దిగింది. ఈ క్రమంలో ఈ నెల 24న ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగింది. భర్త కూడా గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు ఇరువురిని టెక్కలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి శ్రీకాకుళం తరలించగా మెరుగైన వైద్యం కోసం విశాఖలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ రమాదేవి మృతి చెందారు. తల్లి దమయంతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు టెక్కలి ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేశారు. తహసీల్దారు ప్రవల్లికప్రియ సమక్షంలో శవ పంచనామా చేశారు.

రైలు నుంచి జారిపడి మహిళ మృతి



సాగునీటి కల్వర్టులో మృతదేహం

కోటబొమ్మాళి: మండలంలోని యలమంచిలి పంచాయతీ గురువెల్లిపేట సమీపంలో సాగునీటి కల్వర్టులో శుక్రవారం సాయంత్రం రైలు నుంచి ప్రమాదవశాత్తు జారిపడి పశ్చిమబెంగాల్‌కు చెందిన గుర్తు తెలియని మహిళ మృతిచెందినట్లు పలాస రైల్వే ఎస్ఐ షరీఫ్ తెలిపారు. మృతురాలి వయసు 30 ఏళ్లు ఉంటుందని, హ్యాండ్‌బ్యాగ్‌లో ఉన్న గుర్తింపు కార్డు ఆధారంగా పశ్చిమ బెంగాల్‌కు చెందిన మహిళగా గుర్తించామని పేర్కొన్నారు. రైల్వేపోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పాముకాటుతో మహిళ మృతి



దున్న తులసమ్మ

సోంపేట: మండలంలోని మామిడిపల్లి పంచాయతీ గణేష్ సెంటర్‌కు చెందిన దున్న తులసమ్మ (40) శుక్రవారం పాము కాటుతో మృతి చెందింది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తులసమ్మ రోజూ పొలాల్లోని గోంగూర కోసి ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లి అమ్ముతుంటారు. శుక్రవారం ఉదయం కూడా పొలానికి వెళ్లి గోంగూర కోశారు. పొలంలో ఏదో కాటు వేసినట్లు అనిపించినా ఆమె పట్టించుకోలేదు. గ్రామం నుంచి బయల్దేరి బస్సులో పలాస మండలం అక్కుపల్లి గ్రామం చేరుకుంది.

బస్సు దిగిన వెంటనే తీవ్ర అస్వస్థతకు గురై స్పృహ తప్పి పడిపోయింది. వెంటనే స్థానికులు సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి, అక్కడినుంచి ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పాముకాటుగా గుర్తించి చికిత్స అందించినా పరిస్థితి విషమించింది. మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతిచెందారు. ఈమె భర్త గిరి బాబు పదేళ్ల కిందట క్యాన్సర్‌తో మృతి చెందారు. వీరికి వందన, ఝాన్సీ అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సోంపేట ఆస్పత్రిలో శవ పంచనామా నిర్వహించారు. బారువ పోలీసులు కేసు నమోదు చేశారు.